ప్రజాశక్తి

మంగళవారం 7 మే 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం

ఎరుపెక్కిన మన్యం

ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం పట్టణంలో సిపిఎం శ్రేణులు నిర్వహించిన ర్యాలీతో మన్యం ప్రాంతం ఎరుపెక్కింది. వందలాది మంది గిరిజనులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు ఎర్రజెండా చేతబట్టి ర్యాలీలో పాల్గొనడంతో ఆయా ప్రాంతాలు అరుణారుణం అయ్యాయి. ఎల్విన్ పేట నుంచి గుమ్మ లక్ష్మీపురం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, కురుపాం అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణతో పాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సిహెచ్ నర్సింగరావు, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అడుగడుగునా మహిళలు వారికి పూలమాలతో స్వాగతం పలికారు. డబ్బు కళాకారుల వాయిద్యాలు, యువతి, యువకుల గిరిజన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సిపిఎం శ్రేణులు

సిపిఎం గెలుపుతోనే
గిరిజనులకు న్యాయం

- ఓటు అడిగే హక్కు బిజెపి, వైసిపి, టిడిపిలకు లేదు
- గిరిజన సమస్యలపై ఏనాడూ నోరు మెదపలేదు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్
- గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురంలో భారీ ర్యాలీ



బృందాకరత్, అభ్యర్థులకు స్వాగతం పలుకుతున్న మహిళ



ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు అప్పలనర్స, మండంగి రమణతో కలిసి అభివాదం చేస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సీనియర్ నాయకులు నర్సింగరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం టౌన్

ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. గిరిజన సమస్యలపై ఏనాడూ నోరు మెదపని బిజెపి, వైసిపి, టిడిపిలకు ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో జరిగిన సభలోను, పార్వతీపురంలో జరిగిన రోడ్డుషోలోనూ ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదా సహా ప్రజా సమస్యలపై మాట్లాడలేదని అన్నారు. టిడిపి కూడా ఏనాడూ ప్రశ్నించలేదన్నారు. మోడీ ప్రభుత్వం కూడా హోదా కోసం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదన్నారు. రైతులు, కార్మికులు, గిరిజనుల హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాసిందన్నారు. బిజెపితో టిడిపి, జనసేన పొత్తు, వైసిపి తొత్తు పచ్చి అవకాశవాదమని అన్నారు. బిజెపి నుంచి దేశాన్ని రక్షించడానికి 22పార్టీలు కలిసి ఇండియా వేదికగా ఏర్పడ్డాయని తెలిపారు. బిజెపి పదేళ్ల పాలనలో రాజ్యాంగం పూర్తిగా నాశనమైందని అన్నారు. అదాని, అంబానీ వంటి కార్పొరేట్ వ్యక్తుల సంక్షేమమే ధ్యేయంగా బిజెపి పాలన సాగిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలైన విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వేను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. మతం పేరుతో పాలన సాగిస్తూ ప్రాంతాలను విడదీసి ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని అన్నారు. గత ఎన్నికల్లో 23 మంది వైసిపి ఎంపీలు పార్లమెంట్‌లో బిజెపి ప్రభుత్వానికి భయపడి మాట్లాడకుండా నోటికి ప్లాస్టర్లు వేసుకున్నారని విమర్శించారు. గిరిజనుల సమస్యలపై పోరాడే ఎంపి అభ్యర్థి అప్పలనర్సకు, ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణకు, పార్వతీపురం కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహనరావుకు ఓటు వేసి పార్లమెంటు, అసెంబ్లీకి పంపించాలని పిలుపునిచ్చారు. అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స మాట్లాడుతూ (మిగతా..2లో)



విజయనగరంలో బారులు తీరిన ఉద్యోగులు

రెండో రోజూ
అదే తీరు

- ఉత్సాహంగా తరలివచ్చిన ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో 8537 ఓట్లు నమోదు

ప్రజాశక్తి-యంత్రాంగం

పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునేందుకు రెండోరోజు సోమవారం కూడా ఉద్యోగులు ఉత్సాహం చూపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9138 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయనగరం జిల్లాలో 6005 ఓట్లు, మన్యం జిల్లాలోని 4 నియోజక వర్గాల్లో 2532 ఓట్లు పోలయ్యాయి.


బొబ్బిలి : బొబ్బిలి నియోజకవర్గంలో రెండోరోజు 843 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో 2096 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా మొదటి రోజు 749 ఓట్లు, రెండోరోజు 843 ఓట్లు పోలలై రెండురోజులు 1592 ఓట్లు నమోదయ్యాయి. ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టారు. పోలింగ్ తీరును రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ పర్యవేక్షణ చేశారు. ఇప్పటికి ఫారం-12 ఇవ్వని వారికి నేడు,రేపు ఓటు వేసే అవకాశం కల్పిస్తామని రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ చెప్పారు.

విజయనగరం టౌన్ : రెండో రోజు సోమవారం 1449 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఉదయం నుంచి ఉద్యోగులు ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు క్యూలో నిలబడ్డారు. ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి కార్తీక్ పరిశీలించారు.

శృంగవరపుకోట : నియోజకవర్గంలో 787 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ తెలిపారు. 1757 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను సోమవారం 783 ఓట్లు.. మొత్తంగా 73.25 శాతంగా ఓట్లు పోలయ్యాయని వివరించారు.

నెల్లిమర్ల : సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 660 మంది రెండు రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నారు. పోలింగ్‌ను ఆర్ఒ ఎం.నూక రాజు, ఎఆర్ఒ డి.ధర్మ రాజు పర్యవేక్షించారు.

గజపతినగరంలో 794, చీపురుపల్లి నియోజక వర్గంలో 697 ఓట్లు, రాజాం నియోజకవర్గంలో 775 ఓట్లు (మిగతా..2లో)



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజా సంక్షేమంతో
రాజకీయాలు వద్దు

ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-మెరకముడిదాం

ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలతో రాజకీయం చేయటం ప్రతి పక్షానికి తగదని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు మీరు చేసే మంచిని చెప్పి ఓటు అడగాలని టిడిపికి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని బైరిపురం, ఉత్తరావిల్లి, బుదరాయ వలస గ్రామాల్లో జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో పార్టీ రహితంగా తమకు ఓటు వేయని టిడిపి వారికి (మిగతా..2లో)

సిపిఎం గెలుపుతోనే గిరిజనులకు న్యాయం



శేషగిరికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

శేషగిరి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- బొబ్బిలి

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.శేషగిరి మాస్టర్ ఆశయ సాధనకు పని చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి అన్నారు. స్థానిక తాండ్రపాపారాయ మున్సిపల్ పాఠశాలలో శేషగిరి వర్ధంతి సభ నిర్వహించారు. శేషగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి శేషగిరి చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి పోరాటం చేసి ఆయన ఆశయాలను సాధిస్తామని చెప్పారు. సభలో యుటిఎఫ్ నాయకులు జి.స్వామినాయుడు, పి.సత్యనారాయణ, శ్రీనివాస్, మురళి, రాధాకృష్ణ, మహేష్ మాట్లాడి శేషగిరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిమిడిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి : కడుబండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలంతా తనను మరోసారి ఆశీర్వదించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు కోరారు. సోమవారం మండలంలోని తిమిడి, గంగిరెడ్లపాలెం, వెంకటరమణపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎమ్‌పిగా ఝాన్సీని ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, వాకాడ రాంబాబు, సాంబరాజు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తవలస : ఎమ్మెల్యే స్వగృహంలో యాత కార్మికుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యాత సామాజికవర్గం అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించాలని కోరారు.

(మొదటిపేజీ తరువాయి)

బిజెపి పదేళ్ల పాలనలో రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేస్తూ గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే గిరిజనులను అడవి నుంచి దూరం చేయడం ఖాయమన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా కార్పొరేట్ వ్యక్తులకు కంపెనీల పేరుతో విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం దుర్మార్గపు చర్య అన్నారు. గిరిజనులకు ఇంత అన్యాయం జరుగుతున్నా వైసిపి, టిడిపి ప్రశ్నించలేని స్థితిలో ఉన్నాయని అన్నారు. గిరిజన ద్రోహులుగా మిగిలిపోయే పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం గిరిజనుల సమస్యలపై పోరాడే తమను ఆశీర్వదించి అసెంబ్లీకి, పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.

కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడిచినా నేటికీ గిరిజన గ్రామాలు రోడ్లు లేకపోవడంతో గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదన్నారు. గిరిజన విద్య, వైద్యం, తాగునీరు గిరిజనులకు అందడం లేదన్నారు. కోరన్న, మంగన్న, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోరాట ఫలితంగా ఏర్పడిన ఐటిడిఎ, జిసిసిలను పాలక పార్టీలు నిర్వీర్యం చేయడం వల్ల గిరిజనులకు ఏమాత్రం మేలు జరగడం లేదన్నారు. గత 17ఏళ్లుగా కురుపాం నియోజకవర్గంలో ఏనుగుల సమస్య ఉన్న వైసిపి, టిడిపి ప్రభుత్వాలు వాటిని తరలించడంలో విఫలమయ్యాయని అన్నారు.



పార్వతీపురంలో ర్యాలీకి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ మతతత్వ పార్టీ బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించినప్పుడే రాజ్యాంగానికి, ప్రజలకు రక్షణ ఉంటుందని అన్నారు. వైసిపి, టిడిపికి ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్టే అవుతుందన్నారు. ఇప్పటికైనా గిరిజనులు మేల్కొని గిరిజన పక్షాన పోరాడేది ఎవరో గుర్తించి ఓటు వేయాలని అభ్యర్థించారు. సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గంగునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ నరసింగరావు, కె.సుబ్బరావమ్మ, పార్టీ మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్, విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, కె.గౌరీశ్వరరావు, పి మోహన్ రావు, అశోక్, పార్వతీపురంలో కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి బత్తిన మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం పార్వతీపురం పట్టణంలో రోడ్డుషో నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు ఈ ర్యాలీ సాగింది. రోడ్డుషోలో సిపిఎం నాయకులు బృందాకరత్, ఎంపి అభ్యర్థి అప్పలనర్స, నాయకులు సుబ్బరావమ్మ, కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహన్‌రావు పాల్గొన్నారు. వీరికి కోలాటం, డప్పుల వాయిద్యాలతో డప్పులతో కళాకారులు స్వాగతం పలికారు.



పార్వతీపురం ర్యాలీలో కోలాటమాడుతున్న మహిళలు

ప్రజా సంక్షేమంతో రాజకీయాలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

కూడా సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. కాదని మీరు చెప్పగలరా? అని టిడిపి నాయకులను ప్రశ్నించారు. కుటుంబంలో మంచి జరిగితేనే తమకు ఓటేయాలని అడిగే దమ్ము తమకు ఉందని, టిడిపికి ఆ ధైర్యం ఉంటే అడగండి చూద్దాం అంటూ సవాల్ చేశారు. బైరిపురం గ్రామంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ మండలంలో మారు మూల ప్రాంతాలకు రోడ్లు వేశామని,పాఠశాలలు, తాగునీరు, హాస్పిటల్స్ సచివాలయాలు, ఆర్‌బికెలు ఏర్పాటు చేశామని తెలిపారు. మళ్లీ వైసిపిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పప్పల విజయకుమారి, ఉప సర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, సీనియర్ నాయకులు పప్పల గ్రహణేశ్వరావు, కందుల మల్లి, సింగారపు రామకృష్ణ, మండల నాయకులు తాడ్డి వేణు, పెద బాబు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ అదేతీరు

(మొదటిపేజీ తరువాయి)

పోలయ్యాయి.


మన్యం జిల్లాలో 2532 ఓట్లు

కురుపాం : స్థానిక మోడల్ స్కూల్లో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్‌లో 888 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణ తెలిపారు. నియోజకవర్గం మొత్తం మీద 2241 మంది పోస్టల్ బ్యాలెట్ కలిగిన ఉద్యోగులుండగా ఇప్పటి వరకు 1798 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సోమవారం 584మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని సీతంపేట ఐటిడిఎ పిఒ, రిటర్నింగ్ అధికారి శుభమ్ బన్సల్ సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఈనెల 9 వరకు పొడిగించామని, ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సాలూరు : ఆర్‌ఒ విష్ణుచరణ్ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించిన 561 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పార్వతీపురం: నియోజకవర్గంలో జరిగిన పోస్టల్ బ్యాలెట్‌కు 1751ఓట్లకు గాను, సోమవారం 499 ఓట్లు పోలయ్యాయి. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో జిల్లాయేతర ఓటర్లు సోమవారం 435 ఓట్లు పోలయ్యాయి.



కురుపాం : ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు

సూపర్‌సిక్స్ పథకాలతో న్యాయం : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి/తెర్లాం

సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన అన్నారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కోసమే టీడీపీ, జనసేన, బిజెపి కూటమి సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోను ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలన చేసి అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెర్లాం మండలం గంగన్నపాడులో నిర్వహించిన ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో పాటు అభ్యర్థి బేబినాయన పాల్గొన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గెలిపిస్తే మరింత అభివద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం కునాయవలస, ఎంఆర్ అగ్రహారం, పెరుమాలిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకట నాయుడు, మాజీ జౌడ్ వి టి ని వెంకటేశ్వ రరావు, నాయకులు యుగంధర్, సురేష్, అప్పల నరసింహ రాజు పాల్గొన్నారు.



తెర్లాం : గంగన్నపాడులో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి బేబినాయన

రామభద్రపురం : మండలంలోని కోటశిర్లాం, పాడివాని వలస, కొత్తరేగ, మామిడివలస గ్రామాల్లో టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కొత్తరేగ సర్పంచ్ కిలపర్తి మురళీ, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, టిడిపి నాయకులు కర్రోతు తిరుపతిరావు, మడక తిరుపతినాయుడు, కనిమెరక శంకరరావు, తాడ్డి శ్రీనివాసరావు, వసంతుల తిరుపతిరావు, పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని మామిడిపల్లి రోడ్ డబ్బివీధిలో ఉన్న 160 కెవిఎ ట్రాన్స్ ఫార్మర్ సోమవారం సాయంత్రం దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు రేగడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అధిక ఉష్ణోగ్రతకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో 2020 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడుకు 20ఏళ్ల జైలు, రూ.2500 జరిమానా విధించినట్లు రూరల్ సిఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ద్వారపూడి గ్రామానికి చెందిన నిందితుడు కళ్లేపల్లి అప్పారావు (61)కు ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి కె.నాగమణి ఈ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లుగా తెలిపారు. నిందితుడు అప్పారావు 5సంవత్సరాల బాలికపై లైంగిక చర్యకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో 2020 జనవరిలో పోక్సో చట్టం ప్రకారం అప్పటి ఎస్ఐ ప్రసన్న కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి విజయనగరం ఎస్‌సి, ఎస్‌టి సెల్ 1 డిఎస్‌పి బి.మోహనరావు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారు. నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె. నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు. ప్రస్తుత డిఎస్‌పి ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో విజయనగరం రూరల్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ ఆర్. వాసుదేవరావు, కోర్టు ఉమెన్ కానిస్టేబుల్ టి.లక్ష్మి, సిఎంఎస్ హెచ్‌సి రామకృష్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజర్చినట్లు సిఐ తెలిపారు.



గుమ్మలక్ష్మీపురంలో సిపిఎం ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న బృందాకరత్



పార్వతీపురంలో రోడ్ షో నిర్వహిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సిపిఎం అరకు ఎమ్‌పి అభ్యర్థి అప్పనర్స, కాంగ్రెస్ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు

ఎర్రజెండా కదనోత్సాహం



ఎర్రరంగు బెలూన్లతో స్వాగతం పలుకుతున్న చిన్నారి



అవ్వను ఆప్యాయంగా పలుకరిస్తున్న బృందాకరత్





మాట్లాడుతున్న ఎమ్‌పి అభ్యర్థి అప్పలనర్స, సిపిఎం సీనియర్ నేత ఎం.కృష్ణమూర్తి



సిపిఎం ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులతో బృందాకరత్



ఆకట్టుకున్న డప్పు కళాకారుల ప్రదర్శన



పార్వతీపురంలో ఎర్రరంగు బెలూన్లతో బృందాకరత్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు



విప్లవ గేయానికి యువతుల నృత్య ప్రదర్శన




ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
మంగళవారం
7 మే 2024

అంత సులువు కాదు!

- నెల్లిమర్లలో హోరాహోరీ
- తెరపైకి కులం కార్డు
- ఈసారి ఎవరికి కాపు కాస్తారో?

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నెల్లిమర్ల నియోజకవర్గంలో గెలుపెవరదన్నది గతంలో సునాయాసంగా అంచనాలు వేసేవారు. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో తూర్పుకాపు ఓటు బ్యాంకు సుమారుగా 45 శాతం ఉంది. దాంతో ఈ నియోజకవర్గంలో ఎవరు పోటీ చేసినా తూర్పుకాపు సామాజిక వర్గం అభ్యర్థి మాత్రమే గెలుస్తాడన్నది జగమెరిగిన సత్యంగా మారింది. రాజకీయ పార్టీల అధినేతలు ఈ నియోజకవర్గం గురించి సర్వేలు చేయించుకొని చివరికి తూర్పుకాపుకే టికెట్ కేటాయింపులు చేసి విజయం అందుకోవడం పరిపాటి. అయితే ఈ సారి కూడా నియోజకవర్గం నుండి తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు వైసిపి సీటు కేటాయించింది. టిడిపి కూడా తూర్పు కాపు అభ్యర్థి కర్రోతు బంగారాజును సిద్ధం చేసింది. అయితే రాజకీయ సమీకరణలు నేపథ్యంలో నియోజక వర్గం నుంచి అనూహ్యంగా జనసేనకు టికెట్ కేటాయించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే జనసేన మరో బలమైన (తెలగా) సామాజిక వర్గానికి చెందిన లోకం మాధవిని అభ్యర్థిగా నిలబెట్టింది. నియోజకవర్గంలో టిడిపి కాపు సామాజిక వర్గమంతా ఇప్పుడు లోకం మాదవితో ఉన్నారు. మరో బలమైన తెలగా సామాజిక వర్గం నాయకుడు కందులు రఘుబాబు వైసిపికి మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఈ సారి వైసిపి, కూటమి అభ్యర్థులు మద్య నువ్వానేనా అన్న పోటీ నెలికొంది. ఈ సారి గెలుపు అంచనాలు వేయడం అంత ఈజీ కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ సారి అత్యధికంగా ఉన్న కాపులు ఎవరికి కాపు కాస్తా రన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికలతో కాపుల కోటకు బీటలా..? పధిలమా..? తేలిపోనుంది.



ఐదు దశాబ్దాలుగా వారిదే గెలుపు

రాజకీయంలోకి కుల సమీకరణలు తెరపైకి రాకముందు ఈ నియోజకవర్గం అంటే ఒకప్పటి భోగాపురం నియోజకవర్గం నుంచి తెలగా కులానికి చెందిన కొమ్మూరి అప్పుడుదొర వరుసగా 5 సార్లు విజయం సాదించారు. 1983 నుండి రాజకీయంలోకి కుల సమీకరణలు తెరపైకి వచ్చాయి. దాంతో తూర్పు కాపు సామాజిక వర్గం అభ్యర్థిగా పోటీలో ఉన్న పతివాడ నారాయణ స్వామినాయుడు నియోజక వర్గంలో ఏకంగా ఏడు సార్లు విజయం సాదించారు. మద్యలో అదే సామాజిక వర్గానికి చెందిన బడ్డుకొండ అప్పలనాయుడు రెండు సార్లు విజయం సాదించారు. అంటే దాదాపుగా 1983 నుండి ఇప్పటి వరకూ 50 సంవత్సరాలు పాటు తూర్పు కాపు సామాజిక వర్గానికే ఇక్కడ ప్రజలు పట్టం కట్టారంటే నియోజకవర్గంలో కులం కార్డు ఏ విదంగా పనిచేస్తుందో చెప్పాలిసన అవసరం లేదు.

సంప్రదాయం కొనసాగేనా?

ఈ సారి నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గాలుగా ఉన్న కాపు, తెలగా నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గతం మాదిరి అయితే కాపు అభ్యర్థిదే విజయం సాధిస్తారన్నది తెలిసిందే. అయితే ఈ సారి టిడిపికి సంబందించిన నాలుగు మండలాల కాపు సామాజిక వర్గంలో దాదాపుగా సగం మంది కూటమి అభ్యర్థి లోకం మాధవి వైపు సపోర్ట్ చేస్తున్నారు. మరో బలమైన తెలగా సామాజిక వర్గానికి చెందిన కంధుల రఘుబాబు వైసిపికి మద్దతుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గెలుపు ఎటువైపు ఉంటుందన్నది అంచానాలు వేయలేని స్థితి నెలకొంది. దీంతో ఇరువురు అభ్యర్థులు తమ సొంత కులం కార్డును తెరపైకి తెచ్చారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న కాపులు ఎవరికి కాపుకాస్తే వారిదే విజయం అన్నది రాజకీయ మేధావులు చెబుతున్నారు. మరి ఈ సారి కాపులు ఎవరికి కాపుకాస్తారోనన్న చర్చ జరుగుతోంది.



చేరికల్లో నిజమెంత..?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవలి రాజకీయ పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. ఈ పార్టీ నుంచి ఆ పార్టీకి, ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి విపరీతంగా మారిపోతున్నారు. ఈ మార్పుల పరిణామాల్లో నిజమెంత? ఎవరికి ప్రయోజనం కలుగుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అప్పటి వరకు కొనసాగిన పార్టీలను వదిలి ఇతర పార్టీల్లో చేరికలు నియోజకవర్గంలో ఎక్కువుగా జరుగుతున్నాయి. ఎన్నికలు నోటిఫికేషన్ రాగానే అధికార వైసిపిని వీడి కొంతమంది జన సేనలోకి చేరారు. ప్రతిపక్ష టిడిపి నుంచి కూడా అధికార వైసిపి లోకి కొంత మంది నాయకులు చేరారు. కాగా చేరికల వల్ల ఆయా పార్టీలు చేతి చమురు వదిలించుకోవడం తప్ప ఏ మేరకు ఎన్నికల్లో ఉపయోగం ఉంటుందన్న సందేహాలు వ్యక్తవుతున్నాయి. ఎందుకంటే నాయకులు మారుతున్నారు గాని వారి వెంట ఉన్న కార్యకర్తలు ఎవరూ పూర్తి స్థాయిలో ఇతర పార్టీల్లోకి వెళ్ళడం లేదన్న వాదన వినిపిస్తోంది. అధికార పార్టీ, జనసేన పార్టీ రెండూ నాయకులను టార్గెట్‌గా పెట్టుకుని డబ్బులు పెట్టి మరీ కొనుగోలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చోటా నాయకులు తప్పితే వారి వెంట కార్యకర్తలు ఎవరూ పార్టీ మారడం లేదని తెలిస్తోంది. అయితే తమ పార్టీలోకి వలసలు పెరిగాయి కాబట్టి వాపును బలుపు అనుకుని సంబరపడి గెలుపు ఖాయమన్న ధీమాతో ఇరు పార్టీల నాయకులూ ఉన్నట్లు సమాచారం. ఏదేమైనా పార్టీల మారుతున్న వారి ప్రభావం ఎంతవరకు వుంటోందో ఎన్నికల వరకూ వేచి చూడాల్సిందే.

ప్రచార హోరు

ప్రజాశక్తి - మక్కువ

ఎన్నికల ఓటింగ్ సమయం దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు తమ తమ ప్రచారాలను వివిధ సాధనాలతో హోరెత్తించడంతో వచ్చే ధ్వనులతో చెవిల్లోని కర్ణభేరులు పగిలిపోతున్నాయని జనం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తెల్లవారిలేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు వివిధ రాజకీయ పార్టీలు వాడే ప్రచార వాహనాలు ఒకదాని వెంబడి ఒకటి తిరుగుతూ ఆయా గ్రామాల్లో రణగొణ ధ్వనులు సృష్టిస్తున్నాయి. అంతేకాకుండా గుర్తు తెలియని నెంబర్లతో మొబైల్ ఫోన్లకు ఐవిఆర్ ప్రచారాలు కూడా మరోవైపు ప్రజలకు ఊపిరాడనీయడం లేదు. ఈనెల 11 వరకు వీటి బారి నుంచి ఎలా బయటపడడం అన్న రీతిలో ప్రజలు విసుగుచెందుతున్నారు. ప్రచారాల్లో మైకుల ద్వారా వెలువడాల్సిన ధ్వనులకు నిర్దిష్ట నియంత్రణ ఉన్నప్పటికీ ఆయా రాజకీయ పార్టీలు వాటిని పట్టించుకోవడం లేదని, వారికి ఇష్టం వచ్చినట్టు ధ్వనులు పెంచుకొని ముందుకు సాగుతున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



ఆ కేంద్రాలతో సమస్యే!

విజయనగరంలో 342, పార్వతీపురం మన్యంలో 289 సమస్యాత్మక కేంద్రాలు

సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గర పడటంతో ఎన్నికల అధికారులు, పోలీసులు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సమస్యాత్మక కేంద్రాలపై దృష్టిసారించారు. ఓటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా ఉండేందుకు ముందస్తు భద్రతా ప్రణాళికలు చేపట్టారు. ఇది వరకే అధికారులు కేంద్రాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసేందుకు కసరత్తు మొదలెట్టారు. సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినచోట అధికారులు పోలింగ్ శాంతియుతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం జిల్లాలో 1173 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 342 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. మెంటాడ మండలం ఆంద్రలో రెండు, శృంగవరపుకోట మండలంలో రెండు కేంద్రాలను రూట్లు లేని కేంద్రాలుగా గుర్తించారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు జిల్లాలో లేవు. జిల్లాలో 17,051 బైండోవర్ కేసులు నమోదు చేశారు. సుమారు 150 రౌడీషీట్ కేసులు తెరిచారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలున్నాయి. జిల్లాలో 25 పోలింగ్ కేంద్రాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా అధికారులు గుర్తించారు. ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాట్లకు పోలీసులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.



గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 11 నియోజకవర్గాలను పరిశీలిస్తే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు... సాలూరు నియోజకవర్గంలో ఎక్కువ (148)గా ఉన్నాయి. తక్కువగా పాలకొండ (15), చీపురుపల్లి (12)లో ఉన్నాయి. జిల్లాలో నియోజకవర్గాల సమగ్ర సమాచారాన్ని పోలీసులు ఇప్పటికే సేకరించారు. ఎక్కడ ఘర్షణలు జరిగే అవకాశం ఉంది? ఏ పోలింగ్ బూత్‌లలో గొడవలకు ఆస్కారముంటుంది? అక్కడ చేపట్టాల్సిన రక్షణ చర్యలేమిటి? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో పోలీసులు కసరత్తు చేపట్టారు. ముఖ్యంగా ఓటింగ్ జరిగే రోజున ఊహించని సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు, పూర్తి భద్రతా చర్యలను పటిష్టం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తే

నియోజకవర్గం	సమస్యాత్మక కేంద్రాలు
విజయనగరం	76
బొబ్బిలి	52
రాజాం	34
గజపతినగరం	39
నెల్లిమర్ల	61
శృంగవరపుకోట	58
చీపురుపల్లి	22
పాలకొండ	15
సాలూరు	148
కురుపాం	49
పార్వతీపురం	77

సెంచూరియన్‌లో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - నెలిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఓటింగ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సోమవారం సిసిసిడిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బిఎస్‌సి అనస్తీషియా విద్యార్థి వహీదా మొదటి బహుమతి, జి.నిఖిల్ రెండో బహుమతి, ప్రజ్ఞ మూడో బహుమతి సాధించారు. వీరిని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ దేవికారాణి, డాక్టర్ నూకరాజు, డాక్టర్ విజయ్ బాబు, డాక్టర్ మోహన్‌బాబు వ్యవహరించారు. సిసిసిడిసి సమన్వయకర్త ప్రొఫెసర్ ఆచార్యులు, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో 1, 2, 3 వార్డుల్లో సోమవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మరిపి విద్యాసాగర్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు, మండలాల అధ్యక్షులు పొందూరు రవీంద్ర, రాంబారికి రామకృష్ణ, పత్రి రాజు, నాయకులు లు రాయి రామారావు, మదనగిరి జగదీష్, గాడి సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసక్తి పెరగాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాసక్తి పెరగాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో సోమవారం మడక శ్రీదేవి మెమోరియల్ స్మారక క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. మొదటిరోజు పోటీల్లో పాల్గొన్న బొబ్బిలి, కొండకెంగువ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు కనిమెరక శంకరరావు, గంట సాయికుమార్, యాండ్రాపు మధు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట, గుడివాడ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కవాతు చేపట్టినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

యువత భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్వార్థ రాజకీయాల కోసం యువత భవిష్యత్తు నాశనం చేయవద్దని జైభీమ్ రావ్ భారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన వెంకటనాయుడు, ఎమ్‌పి అభ్యర్థి అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సూర్య రెసిడెన్సీలో వెంకటనాయుడు మాట్లాడుతూ గతంలో తమ కుటుంబం అనేకమైన పార్టీలకు పని చేసినప్పటికీ అన్యాయం జరిగిందని చెప్పారు. వైసిపి కార్యకర్తగా శంబంగి వెంకట చినప్పలనాయుడు గెలుపు కోసం పని చేశామని, రాజకీయ స్వార్థం కోసం తమ కుటుంబాన్ని పావుగా వాడుకుని అన్యాయం చేశారని ఆరోపించారు. ఉద్దవోలు టిడిపికి కంచుకోటగా ఉంటే వైసిపిని బలోపేతం చేశామని చెప్పారు. గ్రామంలో రెండు గ్రూపుల మధ్య గొడవలు పెట్టి లబ్ధిపొంది తమ కుటుంబాన్ని నాశనం చేశారని ఆరోపించారు. రోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని చెప్పారు. సొంతగ్రామం వెళ్తే అక్రమ కేసులు పెడతామని బెదిరించడం సరికాదన్నారు. తమ గ్రామం వెళ్లి ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని పోలీసులను కోరారు. ఎమ్‌పి అభ్యర్థి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వెంకటనాయుడుకు భద్రత కల్పించాలని కోరారు.

సంక్షేమ పాలనకు మద్దతివ్వండి

ప్రజాశక్తి- బొబ్బిలి

వైసిపి ఐదేళ్ల పాలనలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అమలు చేసిన సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలోని 17, 18వ వార్డుల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పేదరికాన్నే కొలమానంగా తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.

బాడంగి: గతంలో ఇచ్చిన హామీలనే అమలు చేయలేక ఐదేళ్లపాటు ప్రజలను వంచించి ఇప్పుడు కొత్తగా ఏదో ఉద్ధరిస్తామంటూ మన ముందుకు వస్తున్న వారికి బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు అన్నారు. ఆదివారం బీమవరం, ముగడ, గొల్లాది గ్రామలో ఎన్నికల ప్రచారం చేశారు.

డెంకాడ: సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమం అందిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలో గుణుపూరుపేట, చొల్లంగి పేట, ఢీకొల్లం పంచాయతీలలో సోమవారం



బొబ్బిలి: మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడ జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి 20 ఏళ్ల క్రితం మిరాకిల్ సంస్థ ఏర్పాటు చేశారని ఈ నియోజకవర్గంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి రోడ్లు కాలువలు వేసుకున్నారని, తన సంస్థలోకి ఎవరినీ రానీయకుండా అడ్డంగా గోతుల తవ్వి కంచి ఏర్పాటు చేశారని ఆరోపించారు. తనకు, ఎమ్‌పికు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మి, పతివాడ కృష్ణవేణి, సర్పంచులు పైల ముత్యాలరావు, అట్టాడ శివకృష్ణ, కోరాడ కనకరాజు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సంక్షేమ పథకాలు కొనసాగడానికి వైసిపిని గెలిపించాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీ రాములు నాయుడు కోరారు. సోమవారం ఒమ్మి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగర పంచాయతీలో వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండపేటలో కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాస రావు, నాయకులు గంటా సతీష్, బైరెడ్డి నాగేశ్వర రావు, లీలావతి ఎన్నికల ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.



డెంకాడలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



చీపురుపల్లి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కళా, నాగార్జున



వేపాడ: మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

చంద్రబాబుతోనే యువత భవిష్యత్తు : కళా

ప్రజాశక్తి- చీపురుపల్లి

మీ భవిష్యత్తు కోసం టిడిపి గెలిపించాలని చీపురుపల్లి ఎన్‌డిఎ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు, విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం గరివిడి శ్రీరాం జూనియర్ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగ ఉపాద్యాయులతో మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపిని గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయడం చాలా ముఖ్యమన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాం, పికెఆర్‌పురం, రామస్వామి పేట గ్రామాల్లో సోమవారం రాత్రి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సేనాపతి గణేష్, సర్పంచ్ రామసత్యవతి, జనపరెడ్డి ఈశ్వరరావు, యర్ర సన్యాసిరావు, జనసేన, బిజెపి నాయకులు

8న బైక్ ర్యాలీ

విజయనగరం టౌన్ : వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా ఈనెల 8న నగరంలో నిర్వహించి తలపెట్టిన మహిళా బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, కోలగట్ల వీరభద్ర స్వామికి మద్దతుగా నిలవాలని కోరారు. సోమవారం 24వ డివిజన్ బూర్లెపేట నుండి నిర్వహించిన ఎన్నికల ప్రచారకార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అందుబాటులో ఉన్న వ్యక్తులను గెలిపించుకుంటే రానున్న కాలంలో ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. నగరంలో రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిల్లా క్రాంతి, డివిజన్ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న చంద్రబాబు సభ జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఈ నెల 9న పాల్గొనున్న ప్రజాగళం భారీ బహిరంగసభను విజయవంత చేయాలని విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలోని విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారిలో మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సాయంత్రం 4గంటలకు ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ స్థలాన్ని ఆయన పార్టీ ఉత్తరాంధ్ర ఇన్చార్జ్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. సభ ఏర్పాట్లపై చర్చించారు.



మాట్లాడుతున్న నాగార్జున

అనంతరం ఆంజనేయపురంలో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు సభకు నియోజవర్గ పరిధిలోని నాలుగు మండలాల ప్రజలు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామ చంద్రుడు, మహంతి అప్పలనాయుడు, సనపతి శ్రీనివాస్, రౌతు నారాయణ రావు, దన్నాన సూరపనాయుడు, గంట్యాడ సత్యనారాయణ, మీసాల కాశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకం నాగమాధవి

అభివృద్ధే ధ్యేయం : మాధవి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని తనను ఆడబిడ్డగా ఆశీర్వదించాలని నెల్లిమర్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. సోమవారం మండలంలోని చౌడువాడలో టిడిపి ఎంపిటిసి పి. లలితకళ, గోపి, మాజీ సర్పంచ్ పసుపులేటి శ్రీనువాసరావుతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. జనసేన, టిడిపి నేతలతో కలసి జన విజయ యాత్రలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. ఉపాధి చెరువులో మహిళలుతో మాట్లాడారు. తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కూటమిని గెలిపించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పేదలకు ఎంతగానో సహాకారంగా ఉంటాయన్నారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థి మాదవమ్మను గెలిపించాలని టిడిపి నేతలు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, విక్రం జగన్నాధం, ఆకిరి ప్రసాదరావు, ఐటివి శ్రీనువాసరావు, మొంగం మోహన్‌రావు, జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, పతివాడ శ్రీను, శంకాబత్తుల సత్తిబాబు, బాలా అప్పలరాజు, మహంతి శివ, పులపా మల్లేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను బెదిరించడం అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వైసిపి వేసి ఫొటో తీసి వాట్సాప్ చేయాలని ప్రభుత్వ ఉద్యోగులను వైసిపి నాయకులు బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, బెదిరించడం అన్యాయమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బెదిరింపులపై జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్ని ంగ్ అధికారికి పిర్యాదు చేశామని తెలిపారు. ఉద్యోగులు నిర్భయంగా నచ్చిన వారికి ఓటు వేయా లన్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.

బేబినాయనవి చౌకబారు ఆరోపణలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వైసిపికి వేసి, ఫొటో వాట్సాప్ చేయాలని ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నట్లు టిడిపి అభ్యర్థి బేబినాయన చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కొట్టిపారేశారు. బేబినాయన చౌకబారు ఆరోపణలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని స్పష్టంచేశారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేకపోతే ఎలా ఫొటో తీసి పెట్టమంటారని ప్రశ్నించారు. బేబినాయన ఎప్పటికీ రైతు కాలేరని, రాజు మాత్రమేనని చెప్పారు. బొబ్బిలిలో రైతుకు, రాజుకు పోటీ జరుగుతుందని, పోటీలో రైతు విజయం సాధించడం ఖాయమని తేల్చిచెప్పారు. ఆయనతో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు మావుడి శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.



ఎఆర్‌ఒతో వాగ్వివాదం చేస్తున్న వైసిపి, జనసేన నాయకులు

జనసేన, వైసిపి ఘర్షణ

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ఎన్‌డిఎ కూటమి, వైసిపిల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ముందుగా కూటమి తరపున ఏజెంట్‌గా ఉన్న తేజోవతి పోలింగ్ బూత్ కేంద్రం లోపలికి వెళ్లడంతో వైసిపి ఏజెంట్‌గా ఉన్న దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్ ఆమెను అడ్డుకుని బూత్‌లోకి వెళ్లి ప్రచారం చేయడమేమిటని నిలదీశారు. అక్కడున్న సహాయ ఎన్నికల అధికారి వరహాలుకు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. లిల్లీ పుష్పనాథం మాట్లాడుతూ తేజోవతికి ఎటువంటి ఏజెంట్ పాస్ లేకుండా పోలింగ్ కేంద్రంలోకి ఎలా అనుమతించారని ఎఆర్‌ఒ ను ప్రశ్నించారు. అయితే ఆమెకు ఏజెంట్‌గా అనుమతి ఉందని, పాస్ తయారవుతుందని ఏఆర్వో చెప్పటంతో మరింత అసహనం వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థికి అనుకూలంగా అధికారులు వ్యవహరించడం సరికాదని, ఇలా అయితే తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. దీంతో గందరగోళం ఏర్పడింది. పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్న జనసేన అభ్యర్థి జయకృష్ణకు, వైసిపి వర్గీయులకు మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న వైసీపీ అభ్యర్థి కళావతి కూడా అక్కడకు చేరుకుని అధికారులను నిలదీశారు. ఎన్నికల నియమావళి పాటించాలని అన్నారు.

సాధారణ కాన్పులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణులకు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. సోమవారం మండలంలోని డోకిసీల, బందలుప్పి పిహెచ్‌సిలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అక్కడ జరుగు కాన్పుల రిజిష్టర్‌ను పరిశీలించారు. లేబోరేటరీ, వ్యాక్సిన్, మందుల నిల్వలు పరిశీలించారు. పిహెచ్‌లో సాధారణ కాన్పులు జరిగేలా దృష్టి సారించాలన్నారు. అక్కడ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. వడదెబ్బ, డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒఆర్ఎస్ అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. టీకా కార్యక్రమాలను గ్రామాల్లో త్వరగా నిర్వహించాలన్నారు. ఆశా కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు వారి ఆరోగ్య జాగ్రత్తల గురించి 01244451660 ఫోన్ నంబర్ నుంచి వచ్చే కిల్కారీ సందేశాన్ని వినేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ కౌశిక్, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్ వైజర్స్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్

పార్వతీపురంరూరల్ : ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉండీ ఈ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని రెండు రోజుల పాటు పొడిగించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు మే 5,6 తేదీల్లో స్థానిక ఎస్‌విడి కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తులు సమర్పించి 5,6 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని వారి అభ్యర్థన మేరకు గడువును మరో రెండు రోజులు పెంచినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు సమర్పించిన ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఎస్‌విడి కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో మే 7,8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల్లోగా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పక్కాగా స్ప్రేయింగ్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మొదటి విడత స్ప్రేయింగ్ (దోమల నివారణ మందు పిచికారీ) పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్స్‌కు మలేరియా కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక కాబడిన 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఈ నెల 15వ తారీఖు నుంచి నిర్వహించనున్న మొదటి విడత ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌కు ముందస్తుగా వేసిన ప్రణాళిక ప్రకారం కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. వీటికి సంబందించిన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేశామన్నారు. జిల్లాలో ఉన్న ఏడు సబ్ యూనిట్స్ పరిధిలో స్ప్రేయింగ్ నిర్వహించాల్సిన గ్రామాల వివరాలను పిహెచ్‌సిల వారీగా పరిశీలించారు. ఆయా పరిధిలో సమన్వయ శాఖలతో సమావేశాలు నిర్వహించి ఇంటింటికీ చేపట్టబోయే ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ కార్యాచరణపై సమీక్షించాలన్నారు. స్ప్రేయింగ్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. సిబ్బంది సమిష్టి కృషి చేసి మలేరియా, డెంగీ తదితర జ్వరాలు అదుపులో ఉండేందుకు పాటు పడాలన్నారు. సమావేశంలో ఎఎంఒ సూర్యనారాయణ, విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, ఇఒ నాగేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని శిలగం, గోయిది, లాకాయి గూడలో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల ప్రచారం చేపట్టారు. అభివృద్ధి జరగాలంటే జయకృష్ణ గారు గెలవాలని, గత రెండుసార్లు వైసిపిని గెలిపించి తప్పు చేశామని, ఆ తప్పును సర్దిద్దుకొనే సమయం మాకు దొరికింది గ్రామస్తులు తెలిపారు. ప్రచారంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండలం అధ్యక్షులు సవర తోట ముఖలింగం, రాష్ట్ర ఎస్‌టి కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మహాశక్తి ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాయమాటలు నమ్మితే మోసపోతారని, మాట మీద నిలబడే నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన మండలంలోని తుండ, మావుడి, తోణాం, కొట్టు పరువు పంచాయతీల్లో ఇంటింటికీ తిరిగారు. గిరిజన గ్రామాల్లో థింసా నృత్యంతో గిరిజన మహిళలు అడుగడుగునా నీరాజనం పట్టారు. ఆయన కూడా మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేసే అలవాటు చంద్రబాబు నాయుడుకు లేదని గత పాలన చూస్తే అర్థమవుతుందని చెప్పారు. రైతులు, మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసగించిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం వైసిపి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీ ఇచ్చి మభ్యపెట్టడం టిడిపి నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. అన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు వంతెనల నిర్మాణానికి కోట్లాది రూపాయల ఖర్చు చేసినట్లు తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే పూర్తి స్థాయిలో గిరిజన సమస్యలు పరిష్కరిస్తామని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు పీడిక సుదర్శనరావు, మువ్వల ఆదియ్య,నూకయ్య, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ కొండ గొర్రి ఉదయ్ కుమార్, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు పువ్వాడ రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా థింసా నృత్యం చేస్తున్న రాజన్నదొర

పెదపదంలో....

మండలంలోని పెదపదంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సర్పంచ్ రెడ్డి సుకన్య ఎన్నికల ప్రచారం చేశారు. బాగువలస ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు భవిష్యత్తులోనూ కొనసాగాలంటే రాష్ట్రం లో సిఎం జగన్ మోహన్ రెడ్డి కావాలని కోరారు. ప్రచారంలో మాజీ సర్పంచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

మక్కువ : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని వైసిపి మండల నాయకులు ఎం.రంగు నాయుడు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మక్కువలో సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్తూ సాలూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పి.రాజన్నదొరను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమం లో అధిక సంఖ్యలో వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛను ఇంటికి రాలేదని వృద్ధుడి ఆవేదన

సాలూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం మండలంలోని మరిపిల్లి, మామిడిపల్లిలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. మరిపిల్లిలో 85 ఏళ్ల గిరిజన వృద్ధుడు జాడ చిన్నయ్య వద్దకు రాజన్నదొర వెళ్లి ఓటు వేయాలని కోరగా, ఆయన తన ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కదల్లేని పరిస్థితిలో ఉన్నానని, పింఛను డబ్బులు బ్యాంక్ ఖాతాలో వేశామని చెప్పారని రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో చిన్నయ్య పరిస్థితి చూసి చలించిపోయిన రాజన్నదొర ఆయన్ను ఓదార్చారు. నెలరోజుల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఇంటికి ఫించన్ వస్తుందని చెప్పి భరోసా ఇచ్చారు. టిడిపి నాయకుల ఫిర్యాదు వల్ల పింఛన్లు బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని, వాలంటీర్లను పంపిణీ నుంచి తప్పించారని రాజన్నదొర చెప్పారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజలు బాగుండాలంటే ఎర్రజెండా ఎగరాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలు బాగుండాలంటే వారి పక్షాన పోరాడుతున్న ఎర్రజెండా ఎగరాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా పోరాడుతున్న సిపిఎం తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ, ఎంపి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ మండలంలోని కంబవలస పంచాయతీ రాజ్యలక్ష్మీపురం, పెళ్లిగుడ్డు వలస, లక్ష్మీపేట, కంచరపాడు, కోనవలస, విక్రాంపురం పంచాయతీ తమ్మందొరవలస, నందాపురం, కుమ్మరిగుంట పంచాయతీ డంగభద్ర గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పక్షాన నిలబడి పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, సూర్యనారాయణ, లక్ష్మీపురం, రాజ్యలక్ష్మీపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండుతున్న ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఉరుములు, మెరుపులతో గంట పాటు వర్షం కురిసింది. కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గుమ్మలక్ష్మీపురం, పి అమిటి, లక్కగూడ, ఎస్ కె పాడు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

సీతంపేట : మండలంలోని సోమవారం రాత్రి వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కొంత ఉపశమనం పొందారు. పెద్ద వర్షాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయపరిశీలకులు రమాకాంత్ ప్రధాన్

వ్యయ రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయానికి సంబంధించిన వ్యయ రిజిస్టర్లను సోమవారం అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ పరిశీలించారు. పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వ్యయ పరిశీలన బృందాలతో రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. వ్యయ రిజిస్టర్లలో అభ్యర్థి ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మళ్లీ ఈనెల 11న వ్యయ రిజిస్టర్ల పరిశీలన ఉంటుందని, ఆ రోజు తప్పనిసరిగా పరిశీలన చేయించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీల ప్రతినిధులు, వ్యయ పరిశీలన బందాలు తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు శిక్ష తప్పదు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై మండలంలోని ఉద్దవోలులో ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎటువంటి తగాదాలు, చట్టం వ్యతిరేక విధానాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు గొడవలుపడి పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగొద్దని హితవు పలికారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్నికలకు వైద్య సిబ్బంది సిద్ధం : డిఎంహెచ్‌ఓ



ప్రజాశక్తి-విజయనగరం కోట

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియల భాగంగా ఓటింగ్ జరిగే 1847 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది కేటాయింపు జరిగిందని డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు పోలింగ్ సామాగ్రి అందజేసే కేంద్రాల వద్ద సంబంధిత పిహెచ్ సి వైద్య అధికారులతో ప్రథమ చికిత్స కేంద్రాలను ఈనెల 12న ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహించే 13వ తేదీన సంబంధిత కేంద్రాల వద్ద పారామెడికల్ ఉద్యోగితోపాటు, ఆశా కార్యకర్తలను నియమించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద 13వ తేదీ సాయంత్రం జెఎన్‌టియు, లెండి కాలేజ్ వద్ద వైద్యాధికారి ఆధ్వర్యాన రెండు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సెలవులు మంజూరు చేయలేదని తెలిపారు.



వెంకటాపురం సభలో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

టిడిపితోనే బిసిల అభివృద్ధి : కొండపల్లి

ప్రజాశక్తి-గజపతినగరం/దత్తిరాజేరు

టిడిపి అధికారంలోకివస్తే వెనుకబడిన వర్గాల అభివృద్ధి జరుగుతుందని టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.సోమవారం మండలంలోని వెంకటాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసిపి పాలనలో వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వంద సంక్షేమ పథకాలను జగన్ ఎత్తివేశారని తెలిపారు. న్నికల్లో వైసిపికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పివిగోపాలరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దత్తిరాజేరు మండలంలోని షికారుగంజిలో నిర్వహించిన ప్రచారంలో వైసిపినుంచితో పాటు 20కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరిని అభ్యర్థి శ్రీనివాస్ కండువా వేసి పార్టీకి ఆహ్వానించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సాధారణ ఎన్నికలు జరిగే పోలింగు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎంపిడిఓ జి.రామారావు సూచించారు. సోమ వారం ఆయన టెక్కలి, కొండవెలగాడ, చంద్రంపేట, తాళ్ళపూడిపేట, చినబూరాడపేట, పేదబూరాడపేట, పారసాం, కొండగుంపాం, గరికిపేట, పుతికిపేట, మొయిద, కొత్తపేట, గొర్లిపేట, సీతారామునిపేట, రామతీర్థం. సారిపల్లి, కుదిపి, జగ్గరాజుపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ బిఎల్‌ఓలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల తప్పనిసరిగా కల్పించాలని సూచించారు.

సంక్షేమానికి ఓటు వేయండి : బొత్స

ప్రజాశక్తి- గజపతినగరం

గత ఐదేళ్లలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేశామని, వాటిని చూసి వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి బొత్స అప్పలనర్సయ్య అన్నారు. సోమవారం సాయంత్రం పురిటిపెంటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ అబద్ధపు హామీలతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబునాయుడు సిద్ధం అయ్యాడని, పుట్టుకపోతే వచ్చిన బుద్ధులు పిడకల్తో పోతాయంటూ సెటైర్ వేశారు. మామకు వెన్నుపోటుతో మొదలైన మోసాలు అధికారం లోకి వచ్చాక యువతను, వృద్ధులను, డ్వాక్రా అక్కచెల్లెమ్మలను మోసం చేస్తూనే ఉన్నాడని అన్నారు. వైసిపి హయాంలో కరోనా సమయం లో కూడా సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు గార తవుడు, మాజీ సర్పంచ్ మండల సురేష్, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, గొర్లె సత్యం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పురిటిపెంటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

నిర్భయంగా ఓటు వేయండి

- అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్
- ర్యాలీని ప్రారంభించిన అబ్జర్వర్ తలాత్ పర్వేజ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజలంతా నిర్భయంగా ఓటు వేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం చేపట్టిన మహిళల ర్యాలీని కోట జంక్షన్ వద్ద జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా ప్రారంభించారు. సోమవారం సాయంత్రం కోట జంక్షన్ నుంచి సింగపూర్ సిటీ వరకు ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ జరిగింది. దాసన్నపేట జంక్షన్‌లో మానవ హారాన్ని నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ లాంటివని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే మూలాధారమని అన్నారు. గత ఎన్నికల్లో పురుషుల కంటే మహిళల ఓటింగ్ ఒక్క శాతం అధికంగా నమోదయ్యిందని చెప్పారు. శతశాతం ఓటింగ్ నమోదు చేసే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగా స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించి, పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువ ఓటర్లంతా ముందుకు వచ్చి ఓటు వేయాలని కోరారు. ఎన్నికల్లో అక్రమాలను గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర్రావు, స్వీప్ రీసోర్స్ పర్సన్ పద్మనాభం, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



దాసన్నపేట జంక్షన్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, మహిళలు

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

రాజకీయ వ్యాపారం చేసే అలవాటు నాకు లేదు
వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజకీయ దురుద్దేశంతోనే కాళ్ల గౌరీశంకర్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపైనా, తనపైనా ఆరోపణలు చేస్తున్నారని వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. సోమవారం ఆర్అండ్‌బి వద్ద ఉన్న వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరంలో కాళ్ల గౌరీశంకర్ వ్యక్తిగత విషయాలపై ఆరోపణలు చేయడం తగదని అన్నారు. ప్రస్తుతం సమావేశం జరుగుతున్న వైసిపి కార్యాలయం స్థలం నలుగురి పేరు మీద ఉందన్నారు. తమ నలుగురి మధ్య భూమి సర్దుబాటుకోవడంలో విభేదాలు వచ్చాయని, దీనిపై కోర్టుకు వెళ్లామని వివరణ ఇచ్చారు. కాళ్ళ గౌరీశంకర్ ఎన్నికల ముందు ఈ వివాదం గురించి చెప్పడం సరికాదన్నారు. విజయనగరం నియోజకవర్గంలో ఎవరు ప్రజలకు అందుబాటులో ఉన్నారో అందరికీ తెలుసు నన్నారు. వ్యాపార రాజకీయాలు చేయడం తమకు అలవాటు లేదన్నారు. రాజకీయాలు చేసేది సేవ చేయడానికా?, సెటిల్‌మెంట్లు చేయడానికా? అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు తవిటిరాజు, ధనలక్ష్మి, బాబు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని బాసంగి లో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక అభివృద్ధి కాంక్షిస్తూ ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన వైసిపిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



సమాజ్‌వాదీ పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న నాయకులు

సామాజిక న్యాయమే లక్ష్యం

సమాజ్‌వాదీ పార్టీ జాతీయ నాయకులు జగదీష్

ప్రజాశక్తి-విజయనగరం కోట

సమ సమాజ స్థాపనే సమాసమాజ్ వాది పార్టీ లక్ష్యమని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వ్యవస్థాపక సభ్యులు బచ్చుల జగదీష్ యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలకు వెన్నుముక అయిన ఉత్తరప్రదేశ్‌లో పోరాడుతున్నామంటే దేశం కోసం పోరాడినట్లే అన్నారు. సమసమాజ స్థాపన లక్ష్యంగా స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 80శాతం పైగా ఉన్న బిసి, ఎస్‌సి, మైనార్టీ మిగతా సామాజిక వర్గాలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయన్నారు 2024 ఎన్నికల్లో ఏరికోరి మంచి సేవాభావం కలిగిన అభ్యర్థులను 39 మంది ఎమ్మెల్యేలను, ఏడుగురు ఎంపీలను పోటీలో దింపామన్నారు. మన జీవితాలు పిల్లల భవిష్యత్తు బాగు చేసుకోవాలంటే తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థులు డాక్టర్ అచ్యయ్య నాయుడు, సామిరెడ్డి, విజయనగరం అసెంబ్లీ అభ్యర్థి పెనుమత్స కరుణాకర్, నెల్లిమర్ల నియోజకవర్గ అభ్యర్థి కర్రి కృష్ణ, ఇతర నియోజకవర్గాల అభ్యర్థులు పాల్గొన్నారు.

పేదల భూములు వెనక్కి తీసుకున్న వైసిపి

టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పేదల భూములు వెనక్కి తీసుకున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. సోమవారం 37వ డివిజన్ లో బిసి కోలనీ, గాంధీ పార్క్ ఏరియా, కోట పార్క్ ఏరియా, మజ్జుల వీధి, రామాలయం ఏరియా, శ్రీనివాసనగర్ ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. వైసిపి అభ్యర్థి కోలగట్ల జగన్‌ను చూసి కాదు తనను చూసి ఓటేయ్యండి అంటున్నారంటే ఇది చేతకాని ప్రభుత్వమని అర్థం చేసుకోవాలన్నారు. ఆయను చూసి ఎందుకు ఓటేయాలని, దొంగ పట్టాలు ఇచ్చినందుకా అంటూ ప్రశ్నించారు. విజయనగరాన్ని అభివృద్ధి చేయకపోయినా ఆయన మాత్రం అభివృద్ధి చెందారని అన్నారు. ఈ నేపథ్యంలో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు , వేచలపు శ్రీనివాసరావు అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన లారీ ఓనర్స్ అసోసియేషన్

లారీ ఓనర్స్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతి రాజును కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎన్.రాజేష్ రాజు, వైస్ ప్రెసిడెంట్ అమర శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి కాళ్ల కష్ణ, డి. రామరాజు తదితరులు పాల్గొన్నారు.



బిసి కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి అదితి గజపతిరాజు

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలనుపరిశీలించిన కలిశెట్టి

జెఎన్‌టియులో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను విజయనగరం పార్లమెంటు టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. ఉద్యోగులను కలిసి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంటనే పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తదితరులు ఉన్నారు.